


# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుణ్ణి చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

### కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో
### అలనాటి అందమైన నవల పునర్ముద్రణ

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**ఎవరు ఎన్ని నినాదాలు** చేసినా మనిషి స్వార్ధ రహితుడిగా, ద్వేషానికీ, అసూయకూ అతీతుడుగా ఎప్పుడు వుండడంలేదు. స్వార్ధం లేకుండా వుండాలనటం ఓ స్వార్ధం క్రింద పరిణమిస్తోంది. అసూయకి అతీతంగా వుండాలంటే పిరికివాడని పిలవాల్సి వస్తోంది.

అన్యాయం జరుగుతున్నమాట వాస్తవమే. కాని వివాహం, బంధం యిదంతా మిధ్య అనటం న్యాయాన్ని స్థాపిస్తాయా?

అతని తల బ్రద్దలైపోయింది. ఇన్ని ప్రశ్నలతో అటు పూర్వాచారాల సాంఘిక నిబంధనల నిరంకుశత్వం ఎంత క్షోభ కలిగిస్తోందో, యిటు యీ సమస్యల విపరీత పరిష్కారాలు కూడా అంతే సంక్షోభాన్ని కలిగిస్తున్నాయి.

ఈ సంఘర్షణలో ఛాందసభావాలుగల యువకుడ్ని సంఘంచేత దగా చేయబడిన విప్లవ భావాలతో మండిపోతున్న యువతిని తీసుకుని పరిస్థితుల్ని అల్లుకుంటూ అతను కొత్త నవల రాయసాగాడు.

18

మధుబాబు పూర్తిగా ఆరోగ్యవంతుడయ్యాడు. ఇదివరకటికంటే బాగా వళ్ళు వచ్చింది. చూడగానే యితరుల్ని ఆకర్షించేటట్లుగా వున్నాడు. మొదటి ఆరునెలలూ అసలు ఇంట్లోంచి బయటకు కదనివ్వలేదు అతన్ని. కానీ తర్వాత డాక్టరు సాయంత్రాలు పార్క్‌కి వెళ్ళటానికి అనుమతి ఇచ్చాడు. ఆరునెలల తర్వాత వీధిలోకి వచ్చి రోడ్డుమీద నడుస్తుంటే అతని మనసంతా ఎంతో సంపుల్లమానంగా వుంది. గర్వంగా వుంది. బందరు రోడ్డుమీదకు వచ్చి అక్కడి నుంచి ఆల్‌యిండియా రేడియో వైపు ఉల్లాసంగా నడిచి, అక్కడున్న మైదానంలో పచ్చగడ్డిలో చతికిలపడి, దూరంగా ఆడుకుంటున్న విద్యార్థుల్ని చూడటంలో నిమగ్నమైనాడు.

ఈ మధ్యకాలంలో తనలో ఎంతో మార్పు వచ్చింది. మానసికంగా ఎంతో పెరిగాడు కూడా. ఓ పటిష్టత ఏర్పడింది. ఆత్మవిశ్వాసం కూడా ప్రబలింది.

అతని మొదటి నవల వెలువడింది. సాహితీ సమితి పోటీకి దాన్ని పంపించాడు. పత్రికలన్నీ ఎంతో ప్రశంసించాయి. విమర్శకుడు మాత్రం తన పాతపాట పాడాడు. రెండో నవల కూడా సీరియల్‌గా సమాప్తి చెందింది. పుస్తక రూపాన అచ్చవుతోంది కాని యీ పబ్లిషర్ల అప్రవర్తన పట్ల అతనికి రోత కలిగింది. నిజాయితీ అనేది శూన్యం. మొదట అనుకున్న దానికి యిబ్బడ కాపీలు అచ్చువేసి పారేస్తారు తెలియకుండా. అనుకున్న ప్రకారమైనా డబ్బు యిస్తారా అంటే అదిలేదు. ఇదిగో అదిగో అని కాలయాపన చేసి, చివరకు యాభయ్యో వందో చేతుల్లోపెట్టి, మిగతాదాన్ని గురించి ఎత్తనుకూడా ఎత్తరు. ఆ యిచ్చేదైనా ధర్మం చేసినట్లు ఊరికినే యిచ్చినట్లు, జాలి తలిచి యిచ్చినట్లు ఇస్తారు. పబ్లిషర్ ఆర్థిక సంబధమైన ఇబ్బందుల్లోవుండి ఇవ్వలేనని చెబితే మధుబాబుకు డబ్బు దగ్గర పట్టింపులేదు. కాని తానేమో డబ్బులు చేసుకుంటూ వుంటే రచయితకు న్యాయంగా రావలిసిందాన్ని యివ్వకపోవటానికి కారణమేముందిహ? ఇదీ అతని కోపం.

అసలు పబ్లిషర్ల దుష్కృత్యాలకు కొంతవరకు రచయితలే బాధ్యులు. కాని అది వాళ్ళ తప్పుగాదు. ఎందుకంటే వాళ్ళలో చాలామంది ఆర్థికంగా ఎంతో ఇబ్బంది వున్నవారు. ఎంతో కొంత డబ్బు వాళ్ళకవసరం. ఆ డబ్బుకోసం పబ్లిషర్లు

చెప్పిన షరతుల కన్నిటికీ ఒప్పుకుని, ఆడుతున్న నాటకాలన్నిటినీ భరించాల్సి వస్తోంది. ఇలా కొందరు రచయితలు పబ్లిషర్లకు అలుసయి, వాళ్ళను అందలం ఎక్కించేసరికి యిది మిగతా రచయితలకు కూడా దెబ్బకొట్టింది.

దూరంగా ఆడుకుంటున్న అబ్బాయిల్ని చూస్తూ మధుబాబు ఆలోచిస్తున్నాడు. తనకు చిన్నప్పుడు ఆటలంటే సరదాయే. ఆడుతూ వుండేవాడుకూడా. కాని మనిషి బలహీనంగా వున్నాడని తండ్రి మానిపించేశాడు. మెడికల్ కాలేజీలో ఆ మధ్య కొన్నాళ్ళు టెన్నిస్ ప్రాక్టీస్ చేశాడు. కాని ఇప్పుడిహ ఆ అవకాశం లేదు. తన ఆరోగ్యం బాగుపడినా దీన్ని పువ్వులా వాడుకోవాలి. మాములు మనిషిలా విచ్చలవిడిగా వుండటానికి వీలులేదు.

తన మూడో నవలకూడా పూర్తికావస్తోంది. తాను యింత త్వరగా వ్రాయగలుగుతున్నందుకు అతనికి ఆశ్చర్యంగా వుంది. ఉమాపతికూడా యీ మధ్య రెండు మూడునెలలు నుంచి రాయటానికి ప్రయత్నిస్తున్నాడు. ఇంతవరకూ సగం కూడా పూర్తికాలేదు. జీవితాన్ని గురించీ, సాహిత్యాన్ని గురించీ అతనికి తనకన్న నిర్ధుష్టమైన అభిప్రాయాలన్నమాట నిజమే. తనకు ఓపిక తక్కువ. ఆతృత, మొండిధైర్యం ఎక్కువ. రాసిందాన్ని గురించి పదిసార్లు తర్జన భర్జన చేయటం, రాసింది మళ్ళీ రాయటం తెగ చికాకు.

ఈమధ్య బొత్తిగా కథలు రాయటం మానేశాడు. అదంత మంచిపనికాదు. కాని బొత్తిగా రాయలేకుండా వున్నాడు కథలు. కథ కోసం ఆలోచనలు మొదలుపెడితే నవలా స్వరూపం వస్తోంది. అందులో యీ పబ్లిషర్లు కూడా నవలలు నవలలు అని గోలపెడుతున్నారుగాని కథల సంగతి ఒకరూ ఎత్తరు. మనిషి నలుగురి మధ్యకూ వచ్చి జీవిస్తూ పలుకుబడి సంపాదించాక, ఇదివరకటిలా స్వేచ్ఛగా ప్రవర్తించలేడన్న సత్యం తెలుసుకోసాగాడు మధుబాబు.

ఈ మూడో నవలను ఎందుకో ఏ పత్రికలకూ సీరియల్‌గా ఇవ్వటానికి మనస్కరించటంలేదు. నవలంతా చర్చలమయం. వ్రాయటానికి చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది. చాలా పుస్తకాలు పరిశీలించాల్సి వచ్చింది. మతాన్ని గురించి, సంఘాన్ని గురించీ, ప్రచారంలోవున్న సిద్ధాంతాల గురించీ చాలా విషయాలు తెలుసుకున్నాడు .ఓ విధంగా ఇది రాయటం తన విజ్ఞానాభివృద్ధికి దోహదకారి అయింది. అసలు అవసరం అంటూ లేకపోతే మానవుడు విజ్ఞానాసక్తి లేక స్తబ్దుగా పడి వుండటానికి చాలా అవకాశాలున్నాయేమో? ఈ నవల ప్రచురణ ఆరంభమయితే తాను అనేక విమర్శలకు గురికావలసి వస్తుందేమో?

అసలు రచయితకు ఇలాంటి జీవితం చుట్టూ పరివేష్టించి వుంటుందని ముందుగా ఊహించలేకపోయాడు. ఎవరన్నా చెప్పినా నమ్మివుండేవాడు కాదు. అంటే తాను మహాప్రపంచాన్ని కదిపి, కుదిపి వేస్తున్నాడని కాదు. ఒకనాడు తాను ఎలాంటి పేరుకోసం ఆశించాడో ఆ పేరు వచ్చింది. ఇప్పటికీ కొంతమంది తనని రచయితగా అంగీకరించకపోవచ్చు

కాని తాను కొంతమందిచేత ఆరాధించబడుతున్నాడు. ఇది సత్యం. తన జీవితం ఇలా వుంటుందని ఊహా కల్పనలు చేస్తున్నాడు. ఇలా పేరు ప్రఖ్యాతులు పొందిన అందరికీ ఉంటుందా? అతనికి తెలియదు. రచయితగా తను అదృష్టవంతుడు. అనుకున్నవన్నీ నెరవేరుతున్నాయి. తృప్తి కలుగుతోంది. మెడికల్ కాలేజీలో కొన్ని చిత్రమైన సంఘటనలు జరిగాయి. తనని ఎక్కడికో ఈడ్చుకుపోతున్నాయి.

ఇంకో రెండుమూడు నెలలయిన తర్వాత ఇక్కడినుంచి వెళ్ళిపోవాలి. వెగటుగా వుంది ఇంట్లోని జీవితం. అక్కడకు పోయి చదువుకోవాలి. తను త్వరగా డాక్టరు కావాలి .ఎన్నాళ్ళని ఇలా తండ్రిమీద భారంవేసి వుంటాడూ? చప్పున డాక్టరు కావాలనీ, ప్రాక్టీస్ పెట్టాలనీ, స్వతంత్రంగా జీవించాలనీ అతి ఆత్రంగా ఉంది. తన వయసు ఎక్కువ లేకపోవచ్చు. కాని మానసికంగా పెరిగిపోతున్నాడు. విద్యార్థి దశనుంచి అప్పుడే విడిపోయినట్లుగా ఫీలౌతున్నాడు. గట్టిగా అనుకుంటేనే గాని తను ఎం.బి.బి.ఎస్ స్టూడెంటునన్న విషయం స్ఫురించదు. తన మనస్తత్వం ఎవరూ అర్థం చేసుకోరు. భవిష్యత్ నంతా ఇప్పుడే అనుభవిస్తున్నట్లు ఏమిటో అనుభూతి.

చీకటి పడుతుండగా యింటికి తిరిగి వచ్చాడు మధుబాబు.

ఇవాళ మనసు చాలా ప్రశాంతంగా వుంది. భోజనం చేసి తనగదిలోకి వెళ్ళి మెల్లిగా కాసేపు బుల్ బుల్ వాయించుకున్నాడు. ఎవరూ నేర్పకుండానే, స్వయంకృషి వలన బాగా వాయించగలగటం వచ్చింది. కానీ ఎవరైనా వస్తే ఆపేస్తాడు. సిగ్గు. తన ఆనందంకోసం వాయించుకుంటాడు.

బయటకు వెళ్ళి వచ్చినందువల్ల హాయిగా, మరీ ఆరోగ్యంగా వుంది. ఇలాగే రోజూ వ్యాహాళికి వెడుతూంటే తాను ఇంకా ఆరోగ్యంగా తయారుకావచ్చు.

ఆ రాత్రి పడుకుని నిద్రపోయేముందు ఎందుకో రజని గుర్తుకు వచ్చింది. ఆమెని చూడాలి. మాట్లాడాలి అన్నకోరిక కలిగింది. తన పేరు శైలజ అని మార్చుకుంది. కారణమేమిటో? ఆమెకు మంచి పేరుకూడా వచ్చింది. ఇంకా రెండు మూడు సినిమాల్లో కూడా నటిస్తోంది. యీ మధ్య ఏదో పత్రికలో చూశాడు. తనని గుర్తుపడుతుందో, పట్టదో ఎప్పుడయినా కనిపిస్తే.

అలా ఆలోచిస్తూ నిద్రపోయాడు.

19

వేసవి గడిచిపోగానే మధుబాబు విశాఖపట్నం వచ్చేశాడు. జనవరి నుంచీ రెండు నెలలు కష్టపడి చదివి యీ మార్చికే అసలు ఎప్పీయర్ అవుదామనుకున్నాడు. కాని డాక్టర్ అంగీకరించలేదు. తిరిగి పరీక్షలు నవంబరులో వున్నాయి. అందులో పాసయితే వెంటనే డిసెంబరు నుంచీ మూడో ఏడు కంటిన్యూ చేయవచ్చు.

తనతో కలిసి చదివిన వాళ్ళందరూ ఒక్క ఏడాది ముందు వెళ్ళిపోయేసరికి అతనికి పూర్వం వున్న పరిసరాల్లో వుండబుద్ధి కాలేదు. మహారాణి పేటలో మరో గదికి మార్చి అక్కడవుంటూ శ్రద్ధగా చదవసాగాడు.

సాహితీ సమితివాళ్ళు తాము ఇచ్చిన బహుమతి వివరాలు ఎనౌన్స్ చేశారు. పేపర్లో ఉత్తమ నవలా రచయితగా తాను ఎన్నికయిన వార్త చూసి స్తబ్ధుడైపోయాడు మధుబాబు. కలా నిజమా అనిపించింది. నిజానికి ఆ మధ్య పోటీ విషయంకూడా మరచిపోయాడు. ఎలా వచ్చింది తనకు ప్రైజ్. కేవలం అదృష్టమా! ఆ రాత్రి అంతా ఈ సుఖమైన అనుభూతే స్ఫురించింది.

మరునాడు ప్రాక్టికల్స్ కని కాలేజీకి పోయేసరికి మిగతా స్టూడెంటులంతా వచ్చి అతన్ని అభినందించారు. టీ పార్టీ ఎప్పుడని మొదలుపెట్టారు. ఆ సాయంకాలం అతనికి సాహితీ సమితినుండి అభినందన లేఖ అందింది. బహుమతి ప్రదానం వివరాలు తరువాత తెలియ పరుస్తామని రాశారు.

ఈలోగా అతని మిగతా నవలలు కూడా పుస్తక రూపాన వెలువడినాయి. మూడోది క్రొత్త పబ్లిషర్‌కి ఇచ్చాడు. ఈ కొత్త పబ్లిషర్ యువకుడు, ఉత్సాహవంతుడు. మర్యాద తెలిసినవాడు. మధుబాబుతో బాగా స్నేహము కలిసిపోఇంది. డబ్బు విషయంలో ఇద్దరిమధ్యా పేచీలేదు. తనకు కావలసినంత అడిగి తీసుకున్నాడు మధుబాబు. ఇహమీదట తన పుస్తకాలన్నీ అతనికే ఇద్దామని సంకల్పించుకున్నాడు.

మూడో నవలమీద అనుకున్నట్లుగానే విమర్శలు చెలరేగాయి. నవలంతా అతను చిత్రించిన విరుద్ధ మనస్తత్వాలుగల రెండు పాత్రలు కూడా తాము జీవితాన్ని అపార్థం చేసుకున్నాయని ఒప్పుకుంటాయి. ఇరువుర్నీ పశ్చాత్తాపం ఆవహిస్తుంది. కొంతమందికి ఇది నచ్చలేదు. మధుబాబుని ఛాందసుడనీ, పిరికి అనీ నిందించారు. మరికొందరు చదివి పులకరించిపొయ్యారు. కొందరు ఏమైనా మొదటి నవలలుగా మధుబాబు రాయలేకపోత్నాడని ఓ నిశ్చయం ప్రదర్శించారు. సాఫీగా వున్నది ఉన్నట్లు పరవకుండా విపరీత మనస్తత్వాలజోలికి పోవటమెందుకని కొంతమంది వాదం.

భాషా విషయంలో కథ చెప్పే తీరులో వాస్తవికత లోపించిందని మరికొందరి నమ్మకం. మొత్తం మీద అతని మిగతా నవలలకంటే ఇదే తొందరగా అమ్ముడు కాసాగింది. ఏమైనా ప్రత్యకతలేని నవలని అనటానికి ఎవరూ సాహసించలేదు.

"వాస్తవికత" అనే పదం తరుచు వినబడుతూండేసరికి దాని గురించి తీవ్రంగా ఆలోచించి చూశాడు మధుబాబు. వాస్తవికతకు చేరువగా వస్తున్నారేగాని, వున్నది వున్నట్లు ఎవరూ రాయలేరు. రాస్తే చాలా అసహజంగా, అసహ్యంగా కూడా వుండే ప్రమాదం వుంది. అతి వాస్తవికంగా రాశామనుకున్న రచనల్లో నిండుతనం లోపిస్తుంది. నిర్జీవంగా పేలవంగా వుంటున్నాయి. అనుభూతి నియ్యవు. పెద్ద రచయితలని పిలవబడేవాళ్ళు ఆ పొట్టిపేరేగాని, అన్ని వర్గాలవారిని ఆకర్షించకపోవటానికి ఇదో పెద్ద కారణమని విశ్వశించాడు మధుబాబు.

ఓ రచన యొక్క విజయం, దానికి పెట్టే పేరుమీదా, అందులోని పాత్రలకు పెట్టే పేర్ల బాధకూడా కొంతవరకూ ఆధారపడి వుంటుంది. నిత్యజీవితంలో పుల్లయ్య అనే పేరుగల ఒకడు ఎం.ఏనో లేక ఇంజనీరింగో చదువుతూ వుండవచ్చు. అతడు అనేక ఆకర్షణీయమైన కార్యకలాపాలు చేస్తూనే వుండొచ్చు. ఓ రొమాంటిక్ హీరో కావచ్చు. కాని అదే కథలోకి వచ్చేసరికి అలాంటి లక్షణాలుగల కథానాయకుడికి పుల్లయ్య అనో, ఎల్లయ్య అనో పేరు పెడితే చదివేవాళ్ళకి చిరాకెత్తుతుంది.అలాగే ఎంతమంది వెంకట సుబ్బమ్మలు, రంగనాయకమ్మలు లేరు. అందమైన కాలేజి స్టూడెంట్లుగా? ఓ నవల్లో నాయికను వయ్యారంగా వర్ణిస్తూ అలాంటి పేర్లు పెడితే పాఠకలోకం హర్షిస్తుందా?

మధుబాబు తన రచనల్లోని పాత్రల పట్ల విషయంలో చాలా శ్రద్ధ తీసుకునేవాడు.

శ్రద్ధగా చదువుతున్నాడు. కాని ఎక్కువగా అలసట చెందవద్దని తండ్రి చేసిన హెచ్చరికలు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా తానిహ జీవితాంతం అందరిలాగా స్వేచ్ఛగా వుండలేనా అన్న తలంపు వేధిస్తూ వుండేది.

ఒకరోజు యధాలాపంగా ఓ వారపత్రిక చదువుతుండగా ఓ అమ్మాయి రాసిన కథ అతడ్ని ఆకర్షించింది. ఆ అమ్మాయి పేరు పద్మజ. కథ గొప్పగా ఏంలేదు. శైలి కూడా విలక్షణంగా ఏమీలేదు. కాని ఉల్లాసంగా, ఆహ్లాదకరంగా, మధురంగా వుంది. అతనికి హాయనిపించింది. వెంటనే తన గురించి తనకు స్ఫురించింది. తాను ఎంతో గంభీరమైన జటిలమైన, మనస్తత్వం చిత్రణలు చేశాడు. ఒకవేళ ఈ యాతన, గందరగోళం ఇదంతా జీవితాన్ని మరింత క్లిశితం చేయటానికేనేమో? ఇప్పుడీ అమ్మాయి రాసిన కథ చదివితే ఎంతో సంపుల్లమానంగా వుంది మనస్సు. తియ్యని ఆలోచనలు కలుగుతున్నాయి. ఎంత నిశ్చింతగా వుంటుంది యిలాంటి రచనలు చేస్తూవుంటే చికాకులు లేకుండా.

అతనికి వెంటనే ఆ అమ్మాయికి ఉత్తరం రాద్దామనిపించింది. అమ్మాయో, వయసులో పెద్దో ఏమీ తెలియదు. పేరున్న రచయిత్రికూడా కాదు.

తన దగ్గరనుంచి ఉత్తరం వస్తే ఏమనుకుంటుంది? ఇలా పాఠకుడిగా ఒకరికి రాయటం ఇదే ప్రధమ పర్యాయం. పోనీ మారుపేఉతో రస్తే? అతనికి మనసు ఒప్పుకోలేదు.

వెంటనే ఓ చిన్న ఉత్తరం రాసేశాడు – పద్మజగారికి అని మొదలుపెట్టి.

"బహుశా జీవితంలోని సీరియస్‌నెస్ వల్లనేమో మీ కథ చాలా నచ్చింది. అసలు మనుషులకి కావలసింది ఇలాంటి కథలేనేమోనన్న నమ్మకం కలుగుతోంది. చాలా సరదాగా వుంది. వీలుంటే జాబు రాయండి."

క్రింద సంతకం చేశాడు.

ఆమె ఏడ్రస్ తెలియదు మరి. తనకొచ్చే ఉత్తరాలన్నీ పత్రికల ఆఫీసు నుంచి రీడైరెక్ట్ చేయబడి వస్తాయి. అలాగే ఆ వారపత్రిక కేరాఫ్‌కు పోస్ట్ చేశాడు.

అయిదు రోజుల్లో పద్మజ దగ్గరనుంచి జవాబు వచ్చింది. ఆమెది హైదరాబాద్.

మధుబాబుగారికి,

మీ దగ్గర్నుంచి ఉత్తరం రావటం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఒక సంగతి చెప్పనా? మధుబాబు నా అభిమాన రచయిత. వీలయితే ఎప్పుడన్నా కలుసుకోవాలన్న కోరిక కూడా రహస్యంగా నాలోవుంది. నేను మీ రచనలన్నీ చదివాను. ఎంతో ఇష్టం నాకు. మీ రచనలముందు నావి సూర్యుడి ముందు దివిటీలలాంటివి. అసలు నేను రెండుమూడు కథలకంటే ఎక్కువ రాయలేదు. అవునుగాని ఈ ఉత్తరంతో ఆపేస్తారా? నాకు వరుసగా రాస్తూ వుంటారా? ఈసారి పాఠకుడిగా కాకుండా రచయితగా, నా అభిమాన రచయితగా రాయగోరుచున్నాను.

ఈసారి అంత చిన్న ఉత్తరం రాస్తే... ఇహ ఏంలేదు నాకు కోపం వస్తుంది.

**పద్మజ.**

ఎంత ఆప్యాయంగా వుంది లేఖ. అతనికి శరీరం పులకరించింది. ఒక్కసారికాదు పదిసార్లు చదువుకున్నాడు.

ఈమధ్య అతన్ని వొంటరితనం మరీ వేధిస్తోంది. ఎందుకనో తనకెవరూ లేరనిపిస్తోంది. ఎప్పుడూ అర్ధంకాని అవ్యక్తాందోళన. తన ప్రక్కన ఓ అందమైన అమ్మాయి వుండాలని. ఇద్దరూ ఎక్కడో ఎవరికి తెలియని ఏకాంతంలో

ఒకరికొకరు సమీపంలో అలా పచ్చికలో పడుకుని తానే కళ్ళలోకి చూస్తూ తన మనసుని విప్పి చెబుతుంటే, ఆమె ఊకొడుతూ, నిట్టూరుస్తూ ఆలకించాలని. ఇలా తియ్యటి కలలు. తాను ఒట్టి అయోమయం మనిషి. తనకు తోడు కావాలి. ఆ తోడు కోసం మనసు తహతహలాడుతోంది.

Post your comments

*(కొనసాగింపు వచ్చే నెలలో)*